# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 28 జూలై 2024 SANGAREDDY


## అసెంబ్లీలో శివ్వంపేట రైతు ప్రస్తావన

### రైతుల వడ్డీభారంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హరీశ్‌రావు



రాష్ట్ర అసెంబ్లీలో శివ్వంపేట రైతు వడ్డీ వివరాలు చెబుతున్న హరీశ్‌రావు

శివ్వంపేట, జూలై 27: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసినట్టే చేసి డిసెంబర్ 9 నుంచి ఉన్న వడ్డీ రైతులపై మోపడంతో మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రైతు సాదు ఆంజనేయులు నుంచి బ్యాంకర్లు రూ.9వేల వడ్డీ కట్టించుకున్నారు. ఇదే విషయ మై శనివారం రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిలదీశారు. డిసెంబర్ 9 వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం రైతులను బురిడీ కొట్టించి ఆగస్టు వరకు పొడిగించిందన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ లో భాగంగా డిసెంబర్ 9 వరకు ప్రభుత్వం చెల్లించగా, డిసెంబర్ 9 నుంచి వడ్డీని రైతులే చెల్లించాలని బ్యాంకు సిబ్బంది వసూలు చేస్తున్నారని శివ్వంపేట మండల రైతు వడ్డీ కట్టిన రసీదు ను చూపారు. రుణమాఫీని ఆలస్యం చేసింది ప్రభుత్వం అయితే, అలాంటప్పుడు రైతులు వడ్డీ ఎందుకు కట్టాలని హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.





సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో నిరుపయోగంగా ఉన్న అమీరాబాద్ ఎత్తిపోతల పథకం, తుప్పుపడుతున్న పరికరాలు

### సాగునీటి వనరులున్నా..
## ప్రయోజనం సున్నా..!



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఎత్తిపోతల పథకం పక్కనే ప్రవహిస్తున్న మంజీరానది

- దశాబ్దాలుగా సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఒక్కఎకరానికి అందని సాగునీరు
- ప్రభుత్వం దృష్టి సారించాలని రైతుల విజ్ఞప్తి

న్యాల్‌కల్, జూలై 27 : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ప్రధాన సాగునీటి వనరులు ఉన్నా.. రైతులకు ఏ మాత్రం ఉపయోగం లేదు. కోట్లాది రూపాయలతో మండలంలోని అమీరాబాద్‌లో ఎత్తిపోతల పథకం, చినిగేపల్లి శివారులోని పెద్ద చెరువు నిర్మించినప్పటికీ అధికారుల నిర్లక్షం వల్ల దశాబ్దాలుగా నిరుపయోగంగా మారాయి. మండలం మీదుగా ప్రవహించే మంజీరా నదిపై ఉన్న అమీరాబాద్ శివారులో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. నాబార్డు పథకం కింద 2002-03 లో రూ.1.38 కోట్లతో నిర్మించిన పథకం ద్వారా 500ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఆయకట్టును నిర్దేశించారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క ఎకరానికి చుక్క సాగునీరు పారిన దాఖలాలు లేవు. సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూసిన పాపానపోలేదని రైతులు వాపోతున్నారు. ఏండ్ల తరబడి ఎత్తిపోతల పథకం పనిచేయక భూమిలోని ప్రధాన పైప్‌లైన్లు, పరికరాలన్నీ తుప్పుపట్టిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చినిగేపల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువు నీటితో కళకళలాడుతున్నా సాగునీరు అందడం లేదు. మండలంలోని వడ్డి, డప్పూర్, శంశోల్లాపూర్ గ్రామాల్లోని వాగుల నుంచి ప్రవహిస్తున్న నీరు మంజీరానదిలోకి వెళ్తున్నది. ఈ నీటిని నిల్వచేస్తే మరియంపూర్, రత్నాపూర్, చాల్కి, చినిగేపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామ శివారులోని రైతులకు సాగునీరు అందించవచ్చని మండలంలోని చినిగేపల్లి శివారులో సీమాంధ్ర పాలనలో దాదాపు కోటి రూపాయలతో పెద్ద చెరువు నిర్మించారు. ఈ చెరువు పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 750 హెక్టార్లకు సాగు నీటిని అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పట్లో అధికారులు సరైన ప్రణాళికలు లేకుండా చెరువును ఏర్పాటు చేయడంతో కుడి, ఎడమ కాల్వల నుంచి నీటి సరఫరాకు నోచుకోలేదు. గతంలో ఎడమ కాల్వ కింద మరియంపూర్ శివారులోని రైతులకు కొద్దిగా మాత్రమే సాగుకు నీటి సరఫరా జరిగింది. కుడి కాల్వ కింద మాత్రం చుక్కనీరు పారలేదు. చెరువు ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మిషన్ కాకతీయ పథకం కింద రెండో విడతలో చెరువుకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.40 లక్షలతో పనులు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ పాలనలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందించేందుకు నిర్ణయించిన వాటిని ప్రస్తు త కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. పాత ఎత్తిపోతలు, చిన్న నీటి ప్రాజెక్టులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో మండలంలోని ఆయా ప్రధాన సాగునీటి వనరులైన అమీరాబాద్ ఎత్తిపోతల, చినిగేపల్లి చెరువు పరిధిలోని ఆయకట్టు రైతు ల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆయా గ్రామాల్లోని సాగునీటి వనరులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే దాదాపు 1,250 ఎకరాల్లో పంటలు పండించుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### ఉపయోగంలోకి తీసుకురావాలి



అమీరాబాద్ ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ప్రయోజనం లేకుండా పోతున్నది. వర్షాధారంపైనే ఆధారపడి రైతులు పంటలను పండించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పక్కనే మంజీరా నది ప్రహిస్తున్నా సాగుకు ఉపయోగపడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకువస్తే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నది.

– వైజ్యనాథ్, రైతు, అమీరాబాద్, న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా



సిర్గాపూర్‌లో వాగు వంతెన సమీపంలో బురదమయమైన రోడ్డు

## అధ్వానంగా ప్రధాన రహదారులు

### సిర్గాపూర్‌లో వాహనదారుల ఇబ్బందులు

సిర్గాపూర్, జూలై 27: సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా నల్లవాగు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై స్థానిక పెట్రోల్ పంపు ఎదుట పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలుస్తుంది. సిర్గాపూర్ నుంచి చాప్టా క్రాస్ రోడ్డు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో సిర్గాపూర్ శివారులో వాగు వంతెన వద్ద ఇరుపక్కల రోడ్డు బురద గుంటగా మారింది. దీంట్లో నుంచి బైక్‌లు, వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రధాన రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అధికారులు స్పందించి రోడ్లు బాగుచేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## వసతి గృహాలపై దృష్టి సారిస్తాం

### నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్



నర్సాపూర్‌లో హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, జూలై 27: నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈనెల 24న ప్రచురితమైన వసతి గృహాల్లో సమస్యల తిష్ట అనే కథనానికి మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ స్పందించారు. శనివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం, సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. హాస్టళ్లలో చెత్తాచెదారం, డ్రైనేజ్‌ని పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. అనంతరం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. వసతి గృహాల సమీపంలో చేరిన మురుగును మంగళవారం తొలిగిస్తామని తెలిపారు. ఆది, సోమ వారాల్లో బోనాలు ఉన్నందున, మంగళవారం పారిశుధ్య కార్మికులతో తొలిగిస్తామన్నారు. చైర్మన్ వెంట యాదగిరి, నరసింహులు, సుమన్, రేఖ, స్వప్న, మురళి, పరశురాంరెడ్డి, ఎల్లం, నర్సింగ్, ఫైజాన్, సైఫ్ అలీ మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# చదువుకోవాలంటే నడవాల్సిందే..

- గతేడాది వరకు మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో నడిచిన తరగతులు
- ప్రస్తుత సంవత్సరం నుంచే నడవడం లేదని తల్లిదండ్రుల ఆవేదన
- 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నా.. ప్రభుత్వ పాఠశాల మాత్రం లేదు
- గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

### సిద్దిపేట జిల్లా మందపల్లి మధిర గ్రామం పిట్టలవాడ విద్యార్థుల ఇక్కట్లు



సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలోని పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న పిట్టలవాడ విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, జూలై 27: సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి మధిర గ్రామమైన పిట్టలవాడకు చెందిన విద్యార్థులు తమ గ్రామంలో పాఠశాల లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో 70కి పైగా ఇండ్లు ఉండగా.. జనాభా సుమారు 300 మంది పైగానే ఉన్నారు. కానీ అక్కడ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలు లేవు. గతేడాది వరకు ఆ గ్రామంలోనే నడిచిన తరగతులు ఈ విద్యా సంవత్సరం నుంచే అక్కడ తరగతులను నిలిపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



ఉదయం ఏడు గంటలకే మందపల్లిలోని పాఠశాలకు నడుచుకుంటూ వెళ్లేందుకు సిద్ధవుతున్న పిట్టలవాడ విద్యార్థులు

**ఆ గ్రామంలోని పిల్లలు బడికి వెళ్లి చదువుకోవాలంటే 4 కిలోమీటర్లు నడవాల్సిందే. గ్రామంలో పాఠశాల లేక వేరే పాఠశాలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమీప గ్రామంలోని పాఠశాలకు వెళ్లాలంటే ఎండకు, వానకు సంబంధం లేకుండా రోజూ (రానుపోనూ కలిపి మొత్తం 8 కి.మీటర్లు) నడిస్తే తప్ప వెళ్లలేని పరిస్థితి.**

#### హరీశ్‌రావు చొరవతో నడిచిన తరగతులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి మధిర గ్రామమైన పిట్టలవాడలో 20 డబుల్ బెడ్ రూమ్‌లను ప్రభుత్వమే నిర్మించి వారికి అందించింది. నాడు పిట్టలవాడ గ్రామ ప్రజల కోరిక మేరకు నాటి మంత్రి హరీశ్‌రావు పిట్టల వాడలోని ఓ ఇంట్లో తాత్కాలికంగా పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు బోధన చేయించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో గత సంవత్సరం వరకు తాత్కాలిక పాఠశాలలో తరగతులు నడిచాయి. కానీ ఈ విద్యాసంవత్సరం నుంచి అక్కడ పాఠశాలను తీసివేశారు. దీంతో ఆ గ్రామ విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ పిట్టల వాడ నుంచి సమీపంలో ఉన్న మందపల్లికి వెళ్లాలంటే సుమారు 4 కి.మీలు నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజూ ఉదయం ఏడు గంటలకు బయల్దేరి.. తిరిగి పాఠశాల ముగిశాక రాత్రి ఏడు గంటల వరకు పిల్లలు ఇంటికి చేరుకుంటున్నట్లు వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పిట్టలవాడలో ఒకటో తరగతి నుంచి పదో వరకు చదువుకునే విద్యార్థులు సుమారు 40 నుంచి 50 మంది వరకు ఉన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకునే వారు 20 మంది ఉండగా.. మిగతా వారంతా ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు.

#### రోజూ 4 కి.మీలు నడిచి వెళ్తున్నాం



రోజూ మందపల్లిలోని పాఠశాలకు వెళ్లాలంటే అటు నాలుగు, ఇటు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నాం. చాలామంది చిన్న పిల్లలు ఉన్నారు. వారందరూ అంతదూరం నడిచి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. దయచేసి గ్రామంలో తిరిగి పాఠశాలను ప్రారంభించాలి.

– అఖిల, తొమ్మిదో తరగతి, పిట్టలవాడ

#### నడిచి వెళ్లాలంటే చాలా ఇబ్బంది



రోజూ ఉదయం ఏడు గంటలకు స్కూల్‌కు బయల్దేరి వెళ్తున్నాం. ఇంటికి వచ్చేసరికి రాత్రి ఏడుగంటలు అవుతున్నది. దయచేసి మా గ్రా మంలో పాఠశాల ఏర్పాటు చేయండి. రోజూ అంతదూరం నడిచి పాఠశాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నది.

– సుగుణ, ఏడో తరగతి, పిట్టలవాడ

#### పాఠశాల ఏర్పాటు చేయండి



గతేడాది వరకు గ్రామంలోనే బడి నడిచింది. ఈ ఏడాది దాన్ని తీసివేయడంతో ఉపాధ్యాయులు రావట్లేదు. గ్రామంలోని పిల్లలు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం మీదుగా బస్సులు కూడా లేవు. చాలా మంది చిన్న పిల్లలు ఉన్నా ఒక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం లేదు. అధికారులు స్పందించి పాఠశాల ఏర్పాటు చేయాలి

– చంద్రం, గ్రామస్తుడు, పిట్టలవాడ

## చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు

### అసెంబ్లీలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,జూలై 27:చాలామంది రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ జరగలేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రసంగించారు. ప్రభుత్వం ఒక పాలసీ తీసుకువచ్చినప్పుడు రైతులందరికీ రుణమాఫీ జరగాలని, అలాంటి పరిస్థితి లేదన్నారు. ఒక సొసైటీలో రూ.లక్షలోపు రుణం కలిగిన 240 మంది రైతులు ఉంటే, అందులో కేవలం 140 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ఇంకో సొసైటీలో సుమారు 600 మంది రైతులు ఉంటే కేవలం 400 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. పొలం అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిన రైతులకు అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయిందని, క్రాప్‌లోన్ ఉన్నందున రిజిస్ట్రేషన్ చేయడం వీలుకాదని అధికారులు రైతులను వెనక్కి పంపుతున్నారని తెలిపారు. ఈ విషయాలను అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నానని ఆమె అన్నారు. రుణమాఫీ సరిగ్గా జరగకపోవడంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరిగితే ఎక్కడా రైతులు పాల్గొనలేదన్నారు.

### కిక్కిరిసిన
## దవాఖాన









సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో రోగులు కిక్కిరిసిపోయారు. డెంగీ, వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్, డయేరియాతో జనం హడలిపోతున్నారు. శనివారం భారీగా రోగులు దవాఖానకు తరలిరావడంతో ఎటు చూసినా జనమే కనిపించారు. ఇంకా చాలా మంది ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు.

– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా, జూలై 27

## మూడో అంతస్తు నుంచి పడి విద్యార్థినికి తీవ్రగాయాలు

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి జ్యోతిరావు పూలే గురుకులంలో ఘటన
- గాంధీలో చికిత్స పొందుతున్న అర్చన



హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న అర్చన

పటాన్‌చెరు, జూలై 27: మూడో అంతస్తు నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని పడి తీవ్రంగా గాయపడిన ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో చోటు చేసుకుంది. విద్యార్థిని తండ్రి మహిపాల్‌రెడ్డి వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్ గ్రామానికి చెందిన అర్చన (16)ను పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో నెల రోజుల క్రితం జాయిన్ చేశారు. శనివారం తెల్లవారుజామున ఐదుగంటలకు తండ్రికి గురుకులం ఉపాధ్యాయులు ఫోన్ చేసి కుమార్తె మూడో అంతస్తు నుంచి పడి తీవ్రగాయాలకు గురైందని సమాచారం ఇచ్చారు. పటాన్‌చెరు ఏరియా దవాఖానలో చికిత్సకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత అర్చనను మెరుగైన చికిత్సకోసం సంగారెడ్డి దవాఖానకు తరలించా రు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులకు డాక్టర్లు గాంధీ దవాఖానకు తరలించాలని సూచించారు. డాక్టర్ల సూచనల మేరకు అర్చనను హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ స్కా నింగ్‌లో వెన్నెముక్కకు తీవ్రగాయాలైనట్లు ప్రాథమిక రిపోర్టులు వచ్చాయన్నారు. మూడో అంతస్తు నుంచి ఎలా పడిందో గురుకులం సిబ్బంది సరిగ్గా వివరాలు చెప్పడం లేదని ఆయన పేర్కొన్నారు. వారం క్రితం ఇంటికి వస్తానని చెబితే గురుకులం సిబ్బంది అనుమతి ఇవ్వలేదన్నారు. అర్చనకు మెరుగైన చికిత్స చేయించాలని కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. చికిత్సపొందుతున్న అర్చనను ఆయన పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఆయన కోరారు.



మెదక్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలే

## అన్నివర్గాల సంక్షేమమే మోదీ ప్రభుత్వ ధ్యేయం

మెదక్, జూలై 27(నమస్తే తెలంగాణ): అన్ని వర్గాల సంక్షేమమే మోదీ ప్రభుత్వ ధ్యేయమని, ఎన్డీయే ప్రభుత్వానికి దేశమంతా సమానమేనని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రామదాస్ అథావలే అన్నారు. శనివారం మెదక్‌లోని బీజేపీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. దేశంలోని 85శాతం మంది పేదల కోసం మోదీ సర్కార్ పని చేస్తున్నదని తెలిపారు. ఉజ్వల యోజన పథకం ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. ఇంటింటికీ మూత్రశాలలు, మరుగుదొడ్లు కట్టించామని గుర్తు చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఒక్కో కుటుంబం రూ.5లక్షల వైద్యం అందుతోందని తెలిపారు. ఏపీకి రాజధాని లేకపోవడంతో ఎక్కువ నిధులు కేటాయించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లకు ఎప్పటికీ కేంద్ర బడ్జెట్ అర్థంకాదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రెండు పథకాల కిందే రూ.50వేల కోట్లు వస్తున్నట్టు తెలంగాణ బడ్జెట్ కాపీలోని 4వ పేజీలో ఉందని, ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తప్ప మరే నియోజకవర్గానికి నిధులు ఎందుకు ఇవ్వలేదని ఎంపీ ప్రశ్నించారు.

## సింగూరు ప్రాజెక్టుకు పెరిగిన వరద



పుల్కల్, జూలై 27 : రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరు ప్రాజెక్టులోకి శనివారం రాత్రి వరకు వరద పెరిగింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా ఇందులో ప్రస్తుతం 14.157 టీఎంసీల నిల్వ ఉన్నది. ప్రాజెక్టులోకి వరద రూపంలో వస్తున్న నీరు 2497 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 391 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నది. అందులో తాలెల్మ ఎత్తుపోతల పథకానికి 41క్యూసెక్కులు, హైదరాబాద్ తాగునీటి సరఫరాకు 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, వృథాగా 200 క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు ఏఈ మహిపాల్ తెలిపారు.

## పారిశ్రామికవాడలో ప్రాణసంకటం

- బొంతపల్లి పారిశ్రామికవాడలోని రోడ్ల పక్కనే భారీ వాహనాల పార్కింగ్
- నిత్యం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



బొంతపల్లి పారిశ్రామికవాడలో రహదారి పక్కన పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

గుమ్మడిదల, జూలై 27: బొంతపల్లి పారిశ్రామికవాడలోని రహదారుల పక్కన దారి పొడవున భారీ వాహనాలు నిలపుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలు నిలపడానికి పరిశ్రమల్లో 10శాతం స్థలం పార్కింగ్ కోసం కేటాయించాలన్న నిబంధనలు అమలు కావడం లేదు. సంగారెడ్డి జిల్లా గుమ్మిడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో గ్రాన్యూవల్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమకు చెందిన భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులకు ఎదురవుతున్నాయి. ఈ దారి మీదుగా బొంతపల్లి కమాన్ నుంచి వివిధ పరిశ్రమలకు డ్యూటీలకు వెళ్లే కార్మికులకు, జిన్నారం మండల కేంద్రానికి పోయే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తున్నది. ఈ దారి మీదుగా భారీ వాటర్ ట్యాంకుల వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, బస్సులు, బైక్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పార్కింగ్ చేసిన వాహనాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.